
రక్తదాన శిబిరాన్ని సందర్శించిన సీపీ సాయిచైతన్య

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

- అపోహలను వీడి మనిషి ప్రాణాలను కాపాడాలి
- అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం అందించాలి
- పోలీసు కమిషనర్ సాయిచైతన్య

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ఉన్న అపోహలను వీడి ప్రతిఒక్కరూ రక్త దానానికి ముందుకు వచ్చి మనిషి ప్రాణాలను కాపాడాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని పోలీసుస్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగం వృథాగా పోదని, (మిగతా 8వ పేజీలో...)


గరుత్మంతుడి చిత్రపటం వద్ద నైవేద్యాలు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

- లింబాద్రి గుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

భీమ్‌గల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింబాద్రి గుట్టపై లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ అర్చకులు పట్టు వస్త్రంపై గల గరుత్మంతుని చిత్రపటాన్ని ధ్వజారోహణాన్ని గావించారు. గరుత్మంతుని దివ్య రూపము గల పట్టు వస్త్రములను కలశంలోని జలంచే అభిషేకం చేసి వాటి ముందు నైవేద్యాలు సమర్పించి యాగాన్ని చేపట్టారు. అలాగే ధ్వజారోహణ ప్రక్రియలో సమర్పించిన నైవేద్యాలను (గరుడముద్దలు) సంతానం కోసం ఎదురు చూస్తున్న జంటలకు అర్చకులు అందజేశారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం.


లక్ష్మీ నరసింహ ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు


భట్టివిక్రమార్కను కలిసిన ఎంపీ అర్వింద్

ఆర్‌వోబీలకు నిధులివ్వండి

- పెండింగ్ బిల్లులు విడుదల చేయండి
- డిప్యూటీ సీఎంను కోరిన ఎంపీ అర్వింద్

నిజామాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న మాధవనగర్, అర్సపల్లి, అడవి మామిడిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జీల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను బుధవారం ఎంపీ అర్వింద్ ధర్మపురి కోరారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో బుధవారం ఆయన భట్టి విక్రమార్కను కలిశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి పెండింగ్ బిల్లులను సత్వరమే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్కకు ఎంపీ ధన్యవాదాలు తెలిపి శాలువాతో సత్కరించారు.

బాబ్లీ ప్రాజెక్టు గేట్ల మూసివేత

మెండోర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను సుప్రీం కోర్టు ఆదేశానుసారం కేంద్ర జల సంఘం, శ్రీరాంసాగర్, బాబ్లీ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బుధవారం మూసివేశారని ఎస్సారెస్పీ ఎస్ఈ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఏటా జూలై 1వ తేదీ నుంచి అక్టోబరు 28 వరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెరిచి నీటిని దిగువన ఎస్సారెస్పీలోకి వదులుతారని, అక్టోబరు 29నుంచి జూలై వరకు మూసివేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలసంఘం ఈఈ పర్భీక్లిన్, నాందేడ్ ఈఈ బాన్సాడ్, ఏఈఈ రవి, సతీష్, పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి 59వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో 8
- 16 గేట్ల ద్వారా నీటి విడుదల



విద్యాప్రాంగణాల్లో.. బాలికలకేది రక్షణ?

చదువు చెప్పాల్సిన చేతులు చెడు చేస్తున్నాయ్..

- విద్యార్థినులకు బడుల్లో భరోసా శూన్యం
- బాలికలపై పెరుగుతున్న వేధింపులు
- సర్కారు బడుల్లో కనిపించని నిఘా
- జిల్లాలో ఒక్క స్కూల్‌లోనూ లేని సీసీ కెమెరాలు
- షీటీంల రంగ ప్రవేశం అవశ్యం
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం
- గతంలోనూ పలు చెప్పుకోలేని సంఘటనలు
- పలువురు మృగాళ్లకు దేహశుద్ధి, సస్పెన్షన్లు

విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులతో పాటు పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది వికృత చేష్టలతో గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు బడులకు వెళ్లాలంటేనే జంకే పరిస్థితులు ఉంటున్నాయి. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం పాఠశాలలో బాలికలతో అటెండర్ వ్యవహరిస్తున్న తీరు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు భరోసాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరుగుదొడ్లలో కెమెరాలు పెట్టిన ఉదంతంతో పిల్లల భద్రతపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. గురువుల పట్ల ఉన్న భయంతో కొంతమంది చిన్నారులు ఎవరికీ చెప్పుకోలేక మానసిక కుంగుబాటుకు గురవుతున్నారు. జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నారు.

నిజామాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో బాలికలు అనేక ప్రాంతాల్లో చెప్పుకోలేకని సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే సర్కారు బడుల్లో సరైన రక్షణ చర్యలు లేవనేది సత్యం. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా కొన్ని విద్యా ప్రాంగణాల్లో రక్షణ ప్రశ్నార్థకంగా ఉంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడా కూడా సీసీ కెమెరాలు లేవు. దీనినే ఆసరాగా చేసుకుని కొంత మంది ఉపాధ్యాయులు, సిబ్బంది బాలికలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గతంలో ఇలాంటి సంఘటనల్లో తల్లిదండ్రుల చేతుల్లో ఎంతో మంది ఉపాధ్యాయులకు దేహశుద్ధి జరిగింది. పదుల సంఖ్యలో సస్పెన్షన్‌కు గురైన ఘటనలు ఉన్నాయి. అయినా గురువు అనే ముసుగులో మృగాలు బాలికల పట్ల తమ నైజాన్ని చాటుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలిక సాధికారిత క్లబ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. షీటీంల ద్వారా పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేస్తే సరైన ఫలితాలు వచ్చే ఆస్కారం ఉంది.

అవగాహన కార్యక్రమాలు తప్పనిసరి..

హైస్కూల్ విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు బాలికలకు అసౌకర్యంగా ఉండే ప్రదేశాలలో తాకుతూ ఉంటారు. సురక్షిత బాల్యం- సురక్షిత పాఠశాల అనే లక్ష్యం తో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. షీటీంల ద్వారా బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఎవరైనా బాలికలు ఇబ్బందుల్లో ఉంటే డయల్ 100, 8712659795 షీటీం నంబరును సంప్రదించాలి. బాలికలకు ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలో సైతం శిక్షణ అందించాలి. అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలో నేర్పించాలి. మహిళా ఉపాధ్యాయులు సైతం బాలికలతో తరచూ మాట్లాడి వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విన్నవిస్తాం..

: అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల పట్ల ఎలాంటి ఆకృత్యాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయులైనా, సిబ్బంది అయిన బాలికల విషయంలో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

లెక్కకు మిక్కిలి ఘటనలు..

గతంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులు ఉన్నారు.

మిగతా 8వ పేజీలో...


డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి వద్ద వర్షం వల్ల తడిసిన ధాన్యం

రోజంతా మేఘావృతం..

- రైతులను కలవరపెడుతున్న అకాల వర్షం
- రెండు రోజుల పాటు భారీ వర్షాలకు అవకాశం

నిజామాబాద్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరుగాలం కష్టపడి చేతికి వచ్చిన పంట తుఫాను ప్రభావంతో నీళ్లపాలు కావడంతో జిల్లాలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాను తీరం దాటి తెలంగాణ రాష్ట్రంవైపే వస్తుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్న నేపథ్యంలో వరిధాన్యం కోతలు కోసి కొనుగోళ్లకోసం ఎదురుచూస్తున్న రైతులను కలవరపెడుతుంది. గత రెండు రోజులుగా జిల్లాలో పలు ప్రాంతాల్లో అడపదడపా వర్షం కురుస్తుండడంతో అక్కడక్కడ కళ్లాల వద్ద రైతులు కుప్పలు పోసిన వరిధాన్యం తడిసిపోయింది. పలు ప్రాంతాలలో కల్లాలు లేక రోడ్లపైనే వరిధాన్యం ఆరబెట్టిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. వర్షం వల్ల పలుచోట్ల ధాన్యం తడిసిపోగా బుధవారం రోజంతా ఆకాశం మేఘావృతం కావడంతో ధాన్యం సరిగా ఆరక కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం తేమశాతం రాక కొనుగోళ్లు జరగని పరిస్థితి నెలకొంది. అకాల వర్షం వల్ల చేతికి వచ్చిన పంట తడిసిపోతుండగా అధికారులు సరైన వసతులు కల్పించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అనేకచోట్ల టార్పాలిన్‌లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. మరో రెండు రోజులు తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది.

లైంగికదాడి కేసులో కటకటాల్లోకి..

- మతం మారుతానని, ప్రేమ పేరుతో వంచన
- పదేళ్ల జైలు శిక్ష విధించిన న్యాయస్థానం

నిజామాబాద్ లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని, మతం కూడా మారుతానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన నగరానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ లతీఫ్ అనే వ్యక్తికి పదేళ్ల కఠిన జైలుశిక్ష విధిస్తూ మహిళలపై అత్యాచారాల విచారణ న్యాయస్థానం నిజామాబాద్ స్పెషల్ న్యాయాధికారి హరీష బుధవారం తీర్పు చెప్పారు. నగరంలో ఓ కంటి అద్దాల దుకాణంలో పనిచేసే లతీఫ్ అక్కడికి వచ్చిన ఓ మహిళకు మాయమటలు చెప్పాడు. ప్రేమిస్తున్నానని నమ్మించి, మతం మారి పెళ్లి చేసుకుంటానని ఆమెను లొంగదీసుకుని పలు మార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసు 2024లో నమోదు కాగా బుధవారం న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. మోసగించినందుకు ఏడాది సాధారణ జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా, లైంగికదాడికి పాల్పడినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, రూ.10వేల జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ వాదనలు వినిపించారు. బాధిత మహిళకు రూ.5లక్షల పరిహారం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చెల్లించాలని న్యాయధికారిణి హరీష తమ తీర్పులో సిఫారసు చేశారు.


తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు

టార్పాలిన్లు అందవు.. కష్టాలు తీరవు

- రాయితీపై పంపిణీ చేయని ప్రభుత్వం
- ఏళ్ల తరబడి రైతుల ఎదురుచూపులు
- పంట కాపాడుకోలేక కొనసాగుతున్న కోతలు

కోటగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టార్పాలిన్ల కోసం అన్నదాతలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. అకాల వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఉపయోగించే కవర్లను ప్రభుత్వం అందించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కురుస్తున్న వానతో కళ్ల ముందే తడుస్తున్న ధాన్యాన్ని కాపాడుకోలేని దీనస్థితిలో రైతులు ఉన్నారు. తద్వారా ఆర్థికంగా నష్టపోతున్నారు.

అధిక ధర వెచ్చించి

వానాకాలం సీజన్‌లో జిల్లాలో లక్షల ఎకరాలల్లో వరి, మొక్కజొన్నతో పాటు వివిధ పంటలను రైతులు సాగు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ టార్పాలిన్లు లేకపోవడంతో చేతికి వచ్చిన దిగుబడిని నీటి పాలు చేసుకుంటున్నారు. ధాన్యం బస్తాలు తడిసి మొలకలు ఎత్తుతున్నాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ సమన్వయంతో రైతులకు రాయితీపై టార్పాలిన్లు పంపిణీ చేసేవారు. 250 జీఎస్ఎం నాణ్యత కలిగిన 8-6 మీటర్ల విస్తీర్ణం కవర్ల ధర రూ.2700ఉండగా 50శాతం సబ్సిడీపై రూ.1250కి అందజేసేవారు. కానీ 2017-18 నుంచి ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రూ.3వేల నుంచి 5వేలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

ఆరబెట్టేందుకు సైతం తంటాలు

పొలాలు కోతకు వచ్చినప్పటికీ కోయిస్తే ధాన్యం ఎక్కడ ఆరబెట్టాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు సరిపడా స్థలం లేదు. 10నుంచి 20 రాశులు కాగానే స్థలం కొరత ఏర్పడుతోంది. దీంతో రైతులు రోడ్లపైన, మరికొన్ని చోట్ల ప్రైవేటు స్థలాల్లో ధాన్యాన్ని ఆరబెడుతున్నారు.

రైతులకు అడుగడుగునా ఇబ్బందులు

పొలం కోయించిన తర్వాత ఆరబెట్టి తేమ వచ్చిన తర్వాతే కేంద్రాలకు ధాన్యం తేవాలి. అయితే పొలంలో ఆరబెట్టి తిరిగికేంద్రాలకు తీసుకురావడానికి రైతులకు

మిగతా 8వ పేజీలో...

పలుకుబడి ఉన్న వారికే టార్పాలిన్లా..?
- అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుంటే పట్టించుకోరా? 6
- కోటగిరిలో రైతుల రాస్తారోకో


ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

ఇసుక వాహనాల సీజ్

- 6 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం
- సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా కంటపడిన ఇసుక అక్రమ తరలింపు

వేల్పూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా ఆదేశాలతో పచ్చల నడ్కుడ, వేల్పూర్ గ్రామాల మధ్య వేల్పూర్ శివారులో పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం పచ్చల నడ్కుడ సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా వేల్పూర్‌కు వస్తుండగా మార్గమధ్యలో పెద్దవాగు బ్రిడ్జివద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న దృశ్యం కంట పడింది. వెంటనే పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో పోలీస్‌లు వాగువద్దకు చేరుకొని ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను, జేసీపీని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వాహనాలను సీజ్ చేసి వేల్పూర్ పోలీస్ స్టేషన్‌కు తరిలించినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు.

కోటగిరికి సౌర సొబగులు

- పైలట్ గ్రామంలో ఎంపిక
- ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానళ్లు
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఇందూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాఘర్ ముఫ్తి బిజిలీ యోజన పథకం కింద మోడల్ సోలార్ గ్రామంగా జిల్లాలోని కోటగిరి మండల కేంద్రం ఎంపికైనట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. కోటగిరి గ్రామంలోని అన్ని ప్రభుత్వ భవనాలపై కేంద్ర ప్రభుత్వ నిధులతో సోలార్ ప్లాంట్‌లు నిర్మిస్తామని ఆయన తెలిపారు. పీఎం సూర్యాఘర్ మార్గదర్శకాల ప్రకారం పూర్తి నివేదిక తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. డీపీఆర్ ఆమోదం పొందిన సంవత్సరంలోపు ప్రాజెక్టులు పూర్తిగా అమలయ్యేలా చూడాలని జిల్లా కమిటీ క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. దేశంలో ప్రతి జిల్లాలో ఓ మోడల్ సోలార్ గ్రామాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ 5వేల కంటే ఎక్కువ జనాభా కలిగిన గ్రామాలను ఎంపిక చేస్తారు. జిల్లాలో 30 గ్రామాలు పోటీ పడగా జిల్లా కమిటీ కోటగిరిని ఎంపిక చేసింది.

క్రైం సమాచారం

పాముకాటుతో చిన్నారి మృతి


సరస్వతి (ఫైల్)

బాన్సువాడరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిగుండుతండా గ్రామ పరిధిలోని కాలునాయక్ తండాకు చెందిన సరస్వతి(3) అనే చిన్నారి పాముకాటుతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి తన కుటుంబసభ్యులతో కలిసి నిద్రపోగా బుధవారం తెల్లవారుజామున బాలిక లేచి వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబసభ్యులు ఆమె కుడి కాలుపై పాముకాట్లు ఉండటంతో చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ బాలికను పరిక్షించిన వైద్యులు పరిస్థితి విషమించిందని నిజామాబాద్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. బాలికను నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. బాలిక తండ్రి చౌహాన్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం


శ్రీనివాస్(ఫైల్)

కోటగిరి,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనివాస్(47) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. శ్రీనివాస్ మంగళవారం రాత్రి టాయిలెట్‌కు వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. బాత్‌రూమ్‌కు సంబంధించి ఎలక్ట్రిక్ వైరు తెగిపోయి ఇనుప మెట్లపై పడింది. ఇది గమనించని శ్రీనివాస్ ఇనుప మెట్లపై కూర్చుండే ప్రయత్నం చేయగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి, చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా మృతి చెందారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో దూకి ఆత్మహత్య


సాయిలు (ఫైల్)

నవీపేట,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్‌కు చెందిన గంధం సాయిలు(36) స్థానిక వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన సాయిలు 4నెలల కిందట స్వగ్రామానికి వచ్చాడన్నారు. ఇటీవల భార్య కవితతో గొడవలు జరుగుతున్నాయని, వారం కిందట భార్య ఆర్మూర్ మండలం పిప్రిలోని తన పుట్టింటికి వెళ్లిందన్నారు. ఈనెల 7న బయటకు వెళ్లిన సాయిలు ఇంటికి చేరుకోలేదని బుధవారం అతడి మృతదేహం స్థానిక వాగులో తేలిందని ఎస్ఐ వివరించారు. మృతుడి తల్లి గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నిందితుడికి యావజ్జీవ కారాగారం

కామారెడ్డిటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి న్యాయమూర్తి బుధవారం యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. మాచారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలో 2018 జనవరి 18న ఓ బాలికపై నిందితుడు భుక్యా గణేష్ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాలిక కుటుంబీకులు ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడంతో పాటు పూర్తిస్థాయి ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు నిందితుడికి జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్ జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లిలోని గాంధీనగర్ వడ్డెర కాలనీ వద్ద జాతీయ రహదారిపై ఆటోను వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నాగపూర్ నుంచి వస్తున్న ఆటోను, మెట్‌పల్లి వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో ఆటోడ్రైవర్, అందులో ప్రయాణిస్తున్న వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆటో ముందుభాగం ధ్వంసమైంది. ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్, వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆటోను పక్కకు తొలిగించి ప్రమాదానికి కారణమైన తుఫాన్ వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

రెంజల్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా పకీరాబాద్‌కు చెందిన బాలాజీ, బోధన్‌కు చెందిన సల్మాన్ ఖాన్ మద్యం తాగి వాహనాలు నడపడంతో డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదుచేశామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి నిందితులకు ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారన్నారు. అలాగే న్యూసెన్స్ సృష్టించిన అక్షయ్, గుండారం గణేష్‌లకు జరిమానాతో పాటు 2 రోజుల పాటు సామాజిక సేవ చేయాలని మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

సుభాష్‌నగర్, అక్టోబర్ 29, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలో 1వ టౌన్ పరిధిలో బైక్‌లను దొంగతనం చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. 1వ టౌన్ పరిధిలోని ఓ వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను డాక్యుమెంట్ చూపించమని అడగగా పారిపోయే ప్రయత్నం చేశారని, వారిని పట్టుకోగా ఈ దొంగతనం వివరాలు తెలిశాయన్నారు. దొంగతనం చేసిన వాహనాలను నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన షేక్ గౌస్ కొనుగోలు చేశారన్నారు. నగేష్, హన్మండ్లులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

కలప స్వాధీనం.. కేసు నమోదు

ఇందల్వాయి, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా టేకు కలపను తరలిస్తున్న వాహనాన్ని బుధవారం ఉదయం ఫారెస్ట్ అధికారులు పట్టుకొని సీజ్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి రవిమోహన్‌భట్ తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ధర్పల్లి మండలం రామడుగులో తెల్లవారుజామున ఎలాంటి అనుమతి లేకుండా తన పట్టా భూమి నుంచి వాహనంలో టేకు దుంగలను తరలిస్తున్న సమయంలో పట్టుకొని ఇందల్వాయి అటవీ కార్యాలయానికి తరలించినట్లు వివరించారు. సొంత పట్టా భూమి నుంచి కలపను తరలించాలన్నా అటవీ అధికారుల అనుమతి తీసుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాన్ని పట్టుకున్న వారిలో డిప్యూటీ రేంజ్ అధికారి తుకారాంరాథోడ్, సెక్షన్ అధికారులు అబ్దుల్ అలెక్, భాస్కర్, బీట్ అధికారులు నవీన్‌రాజ్, ఖదీర్, ప్రవీణ్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

లింగంపేట, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమట్‌పల్లిలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ దీపక్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.5530 నగదు, 4సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

నవీపేట,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో జరిగే రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు 11మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఈవో అశోక్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన 40మందికి అండర్-17 బాల, బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సెలక్షన్ పోటీలు నిర్వహించగా 11మంది ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగామణి, పీడీలు రవి, అబ్బయ్య, వెంకట్, స్వప్న, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


బోధన్‌లో ప్రధానమంత్రి, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం

బోధన్ పురపాలికకు రూ.18.7 కోట్లు

బోధన్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): బోధన్ మునిసిపాలిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 18.7కోట్ల నిధులు విడుదల చేసిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పసులోటి గోపికిషన్ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ, ఎంపీ అరవింద్ చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి మునిసిపాలిటీకి అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, తాగునీటి పనులకు ఎంపీ అరవింద్ నిధులు విడుదల చేయించారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఎంపీ చొరవతో జిల్లాలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. జిల్లా కేంద్రంలోని మాధవనగర్, అర్సాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, రోడ్లు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు ఇలా జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే పనులు సాధించడంలో ఎంపీ అరవింద్‌కు ఎవరూ సాటి రాలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ కౌన్సిలర్ వినోద్, వెంకటేష్, మోర్చా అధ్యక్షుడు సూరి, వేణు, శివ, చరణ్, భూమన్న, రాజు, శ్రీను, కిరణ్, కళ్యాణ్, ప్రవీణ్, శివ, చిన్న, అనిల్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల్య వివాహాలు చేస్తే జైలుకే

ఆలూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పురుషులకు 21, స్త్రీలకు 18 ఏళ్లు నిండకముందు వివాహం జరపడం నేరమని జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్ పేర్కొన్నారు. అలా వివాహం జరిపినా.. ప్రోత్సహించిన వారికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. ఆలూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాల్యవివాహాల నిరోధంపై అవగాహన సదస్సులో ఎంపీడీవో గంగాధర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 నిబంధనలపై ఐసీడీఎస్ సిబ్బందికి వివరించారు. బాల్యవివాహాల నిరోధానికి అధికారులను నియమించామని, వారు ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు సమాజికంగా, ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సమతా, ఎంపీవో రాజలింగం, పంచాయతీ కార్యర్శులు చంద్రశేఖర్, నవీన్, నసీర్, దినేష్, కిషోర్, నాగేంద్రబాబు, రానాతరుణం, వందన తదితరులు పాల్గొన్నారు.


పసుపు బోర్డు మేనేజర్ రాణికి వినతిపత్రం అందజేస్తున్న రైతుల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు

రైతులకు ఆర్థిక భారం తగ్గించాలి

జక్రాన్‌పల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ముందుగా పూర్తిమొత్తాన్ని చెల్లించి, అనంతరం సబ్సిడీ పొందడం కష్టంగా మారిందని రైతు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. రైతులకు, రైతు ఉత్పత్తిసంస్థలకు ఆర్థికభారం తగ్గించడానికి స్పైసెస్ బోర్డు నేరుగా 90 శాతం సబ్సిడీ మొత్తాన్ని వెండర్‌కి చెల్లించాలని, మిగతాది రైతు ఉత్పత్తుల సంస్థలు స్పైసెస్ బోర్డు ఖాతాలో జమ చేయడానికి అనుమతించాలని కోరారు. ఈ మేరకు బుధవారం నిజామాబాద్‌లో టర్మరిక్ బోర్డు కార్యాలయంలో ఫామ్ మేనేజర్ రాణికి, అసిస్టెంట్ అధికారి జవహర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఎం కేపీఎం పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్టికల్ పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు భూమారెడ్డి, డైరెక్టర్ రాజారెడ్డి, సంతోష్‌రెడ్డి, సీఈవో సుమన్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా


రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిజ్ఞాన్

వేల్పూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అధికారులను ఆదేశించారు. మండలంలోని పచ్చలనడ్కుడ, మోతె గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలుకేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియను త్వరగా జరిగేలా చూడాలన్నారు. ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు అందజేయాలన్నారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి..

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్, జీపీవోలు, ఇతర సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు.. అనే వివరాలను జీపీవోలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ గోపాల్, ఎంఏవో రాజు, సొసైటీల చైర్మన్‌లు లింబారెడ్డి, రాజేశ్వర్, కార్యదర్శులు మోయిద్ పాషా, రాజేశ్వర్, మానిటర్ అధికారి రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

సోయా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు

బోధన్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): సోయాను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలోనే బోధన్ మండలంలోని కల్దుర్కి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మొట్ట మొదటి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్ చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, 72గంటలలో డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. జిల్లాలో 33వేల ఎకరాలలో సోయాపంట రైతులు పండించారని, కేంద్ర ప్రభుత్వం సోయా పంటను కొనుగోలు చేయడానికి గిట్టుబాటు ధరను క్వింటాలుకు రూ.5328 చెల్లించనున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కల్దుర్కి సొసైటీ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషదాయకంగా ఉందన్నారు. తుపాను కారణంగా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురవనున్న నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలలో పంట పండించి తెలంగాణలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినట్లు తెలిస్తే తహసీల్దార్‌తో పాటు వ్యవసాయ అధికారుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కల్దుర్కి సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ శరత్, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, తహసీల్దార్ విఠల్, క్లస్టర్ అధికారి రవీందర్, సొసైటీ సీఈవో శ్రీనివాసచారి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి బాసటగా..


ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

డొంకేశ్వర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంపల్లికి చెందిన కె.గంగాధర్ ఇటీవల మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పెద్ద కూతురుకు పెళ్లి జరగనుంది. దీంతో గంగాధర్‌తో పాటు 2022-23లో పదవ తరగతి పూర్తి చేసిన స్నేహితులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన కుమార్తె పెళ్లికి హాజరై.. రూ.50 వేలను పెళ్లి ఖర్చులకు అందజేశారు. తమ మిత్రుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు తెలిపారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు


రుద్రూర్‌లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రుద్రూరు,అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు దుకాణ సముదాయాలను బుధవారం తూనికల కొలతల శాఖ అధికారి, ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఏదైనా వస్తువు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే దుకాణ యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణ యజమానులకు సూచించారు. ఈ తనిఖీలలో కానిస్టేబుల్ నరేష్ తదితరులు ఉన్నారు.

సాయవ్వ జీవితాల్లో వెలుగులు నింపింది


బాధితకుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

డొంకేశ్వర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాసరం గ్రామానికి చెందిన సాయవ్వ మంగళవారం మరణించడంతో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బాధిత కుటుంబీకులను బుధవారం పరామర్శించారు. సాయవ్వ మరణించిన నలుగురి జీవితాలలో ఇంకా బ్రతికే ఉందని, ఆమె అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు చాలా గొప్పవారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, కళ్లెం సంతోష్‌రెడ్డి, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఆర్మూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహల నిరోధక చట్టంపై ప్రతీఒక్కరు అవగాహన కల్గి ఉండాలని ఎంపీడీవో శివాజీ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళ శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లకు గ్రామ, మండల స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ బాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు నీరజ, శ్రీదేవి, చైల్డ్ హెల్ప్‌లైన్, డీహెచ్ఈడబ్ల్యు పుష్ప పాల్గొన్నారు.

వేల్పూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బాల్య వివాహల నిర్మూలపై గ్రామ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యంలోనే పెళ్లి చేసుకుంటే జరిగే అనర్థాలు, చైల్డ్ యాక్ట్, బాల్య వివాహనాల నిరోధక చట్టం గురించి ఎంపీడీవో బాలకిషన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఉషారాణి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, ఏపీవో మాణిక్యం, ఇంటి గ్రాటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి గణేష్ పాల్గొన్నారు.

కోటగిరి,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొమురవ్వ కోరారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లో బుధవారం మహిళ శిశు, దివ్యాంగులు, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో బాల్య వివాహల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవోలు విష్ణు, చందర్, ఎంపీవో క్యాకప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఐసీపీఎస్ కౌన్సిలర్ జమ్రు కోరారు. మండల పరిషత్ కార్యాయలంలో బుధవారం బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ మన్మోహన్ శాస్త్రీ, ఏఎస్ఐ ఇలియాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, అంగన్ వాడీ టీచర్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇంటి పన్ను చెల్లించాలి

ఆలూర్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ఎంపీడీవో గంగాధర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని ఎప్పటికప్పుడు సెక్రటరీలు పర్యవేక్షించాలన్నారు. అన్ని గ్రామాల్లో 100శాతం ఇంటి పన్ను చెల్లించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ రాజలింగం కార్యదర్శులు నవీన్, దినేష్, నజరుద్దీన్, కిషోర్, నాగేంద్ర, వందన, రణతరుణం పాల్గొన్నారు.

మార్కెట్‌ను తరలించాలి

భీమ్‌గల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట మార్కెట్‌ను తరలించాలని వ్యాపారులు బుధవారం కమిషనర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. సమంగళి చౌరస్తా నుంచి అంగడిబజార్ వెళ్లే రోడ్డులో దుకాణాల ముందు కూరగాయల మార్కెట్‌ను పెడుతున్నారని దీంతో తమ దుకాణాలకు వచ్చే వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మార్కెట్‌ను తరలించాలని కోరారు.

కోనేరు నిర్మాణానికి భూమిపూజ

భీమ్‌గల్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బడా భీమ్‌గల్ ఎల్లమ్మ ఆలయం వద్ద బుధవారం కోనేరు నిర్మాణానికి వీడీసీ అధ్యక్షుడు బద్రి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. మాజీ సర్పంచ్ మురళి ఆర్థికసాయం చేస్తున్నారు. ప్రకాష్, సాయిబాబా, ప్రశాంత్, గంగాధర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎడపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురికి డయాబెటిక్, మొబైల్ కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం అందులో 25 మందికి మోతె బిందును గుర్తించి వారిని బోధన్ లయన్స్ ఆస్పత్రిలో ఉచిత శస్త్ర చికిత్సకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అజయ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు పుష్పలత, ప్రతినిధులు మెర్సీ, గంగారెడ్డి, శంకర్, సూర్యనారాయణ, కాశీనాథ్, మనోజ్, రాకేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సప్తాహ ప్రారంభం

నవీపేట,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలోని చారిత్రక విఠలేశ్వర ఆలయంలో బుధవారం హరినామ సంకీర్తన సప్తాహ ప్రారంభించారు. 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో జాతర, అన్నదానం చేపడతామని సభ్యులు తెలిపారు.

నేడు రైల్వేగేటు మూసివేత

నవీపేట,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఫకీరాబాద్ రైల్వే గేటును గురువారం రైల్వే డబ్లింగ్ పనులతో పాటు బీటీ రోడ్డు నిర్మాణం కోసం మూసివేస్తామని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు శ్రీనివాస్, దిగంబర్ తెలిపారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి


మోస్రా,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను బుధవారం తహసీల్దార్ రాజశేఖర్ సందర్శించారు. అకాల వర్షం కారణంగా తడిసిన వడ్లను పరిశీలించారు. రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యం నీటిపాలు కాకుండా కొనుగోలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షానికి తడవకుండా టార్పాలిన్లు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజు, శ్రీను, నరేందర్, ఐకేపీ సిబ్బంది, పాల్గొన్నారు.

సాలూర,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు ఆరబెట్టిన ధాన్యంను తడవకుండా జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ శశిభూషణ్ అన్నారు. బుధవారం సాలూర, జాడి జమాల్‌పూర్, సాలంపాడ్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సందర్శించారు. వెంట పీఏసీఎస్ సీఈవో బస్వంత్‌రావు ఉన్నారు.

పరిహారం చెల్లించాలి

రుద్రూరు,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): వానలకు వరి ధాన్యం తడిసి ముద్దయింది. బుధవారం రుద్రూర్ మండల బీజేపీ నాయకులు రైతుల కల్లాల వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు హరికృష్ణ డిమాండ్ చేశారు.


పలుకుబడి ఉన్న వారికే టార్పాలిన్లా?


కోటగిరిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

కోటగిరి,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): చేతికి వచ్చిన పంట అకాల వర్షాలకు తడిసిపోతుంటే అధికారులు పట్టించుకోకపోగా టార్పాలిన్లు పట్టాలు ఇవ్వడంలోనూ పక్షపాతం చూపుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోతంగల్-రుద్రూర్ ప్రధాన రహదారిపై బుధవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. మార్కెట్ కమిటీ నుంచి సహకార సంఘానికి వంద టార్పాలిన్ పట్టాలు రాగా బడా రైతులకే పట్టాలు అందజేశారని రైతులు ఆరోపించారు. సన్న, చిన్న రైతులు పట్టాల కోసం వెళితే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి 20 రోజుల పైన కావొస్తుందని, వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని, పట్టాల కోసం వస్తే పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి పట్టాలు ఇస్తే పంటను వర్షాల బారి నుంచి కాపాడుకుంటామన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమకు టార్పాలిన్ పట్టాలు ఇవ్వకపోతే ఆత్మహత్యలు చేసుకుంటామని పేర్కొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యం

జిల్లా ఎస్ఈ రాపల్లి రవీందర్


విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బోధన్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యమని ఎస్ఈ రాపల్లి రవీందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని చెక్కిక్యాంప్ 33/11 విద్యుత్ ఉపకేంద్రానికి చిన్నమెంటా ఫీడర్ నుంచి ప్రత్యామ్నాయ ఫీడర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ ముక్తార్, వెంకటరమణ, ఏడీఈ రాజశేఖర్, నగేష్‌కుమార్, సునీత, .కల్యాణ్, డేవిడ్, గఫర్ ఉన్నారు.

విద్యుత్ శాఖ పల్లెబాట

మండలంలోని కుమ్మన్‌పల్లిలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంల్లో పల్లెబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతులు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఈ రమేష్ వివరించారు. విద్యుత్ సమస్యలు ఉంటే 1912 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ బోధన్ టౌన్2 గౌతం, నారాయణ, సిబ్బంది తదితరులున్నారు.

వరలక్ష్మికి ఉస్మానియా డాక్టరేట్


పుప్పాల వరలక్ష్మి

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పుప్పాల వరలక్ష్మికి ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగం నుంచి డాక్టరేట్ లభించింది. తెలంగాణ నీటి పారుదల వ్యవస్థ, చరిత్రపై జిల్లా ప్రత్యేకత అనే అంశంపై ఆమె పరిశోధన చేయగా.. ఓయూ చరిత్ర విభాగం డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రొఫెసర్ రామకృష్ణ ఆమె గైడ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం వరలక్ష్మీ గురుకుల డిగ్రీ లెక్చరల్‌గా రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించి ఇబ్రహీంపట్నం మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో హిస్టరీ లెక్చరల్‌గా పనిచేస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన వరలక్ష్మీ బీడీలు చుడుతూ ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఓయూలో ఎంఏ పూర్తి చేశారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి

మోర్తాడ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్‌లో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు ఇవ్వాలని ప్రజాపంథా ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. వారికి ప్రభుత్వం వెంటనే స్థలాలు చూపించాలని ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ జిల్లాధ్యక్షుడు సురేష్, మండల కార్యదర్శి కిషన్, కమ్మర్‌పల్లి మండల కార్యదర్శి అశోక్, నాయకులు సత్తెక్క, దయాల్‌సింగ్, అరుణ, అంజలి, శ్రీనివాస్, రాములమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తాడ్వాయి, అక్టోబరు 29 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌ను ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బ్రాహ్మణపల్లి గ్రామ అభివృద్ధి సమస్యలపై చర్చించారు. టేక్రియాల్ హైవే నుంచి చందాపూర్ వరకు ఉన్నటువంటి బీటీరోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని అలాగే జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రైమరీ స్కూల్ గదులు, ప్రహరీ గురించి మాట్లా డారు. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించేలా చర్య లు తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు.

రక్తదానం చేసిన ఎస్పీ



రక్తదానం చేస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. బుధవారం జిల్లా పోలీసుకార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి రక్తదానం చేశారు. జిల్లాలోని అన్ని డివిజన్ల పరిధిలో 195 యూనిట్ల రక్తం సేకరించడం సంతోషించదగిన విషయమని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం అనేది అనేక మంది ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. కృత్రిమంగా తయారుచేయలేనిది అపారమైనది రక్తదానం మాత్రమేనని తెలిపారు. ఏఎస్పీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అమ్ముకోలేక.. ఉంచుకోలేక


రాముల గుట్ట తండాలో వడ్లు ఎంబటెట్టిన రైతులు

- అడుగడుగునా అన్నదాతకు కష్టాలు
- తగ్గిన పంట దిగుబడి
- పంట విక్రయాల్లోనూ ఇబ్బందులే
- తేమ, తరుగు పేరిట రైతాంగానికి నష్టం

విత్తు నాటిన నుంచి పంట విక్రయం వరకు అన్నదాతకు అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. పంట వేసిన మొదట్లో చీడపీడలు, విత్తనాల కొరత, ఎరువుల లభ్యత, వాతావరణ అనుకూలత ఇలా అన్నింటినీ దాటుకొని అన్నదాతలు శ్రమకోర్చి పంట పండిస్తే చివరికి విక్రయంలోనూ ఇబ్బందులు తప్పట్లేదు. కాస్తో కూస్తో చేతికొచ్చిన పంట అమ్ముకుందామంటే అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుంది. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం అంటూ కొర్రీలు పెడుతుండటంతో ఇక్కట్లు తప్పట్లేదు. పోనీ నిల్వ ఉంచుకుందామంటే స్థలాలు లేని దుస్థితి.

నసురుల్లాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏటా రైతాంగానికి పంటలు చేతికొచ్చిన సమయంలో తిప్పలు తప్పడం లేదు. నస్రులాబాద్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన అన్నదాతలకు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను విక్రయించుకుందామంటే తేమ, తరుగు పేరిట అటు దళారులు, ఇటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర నిరాశ ఎదురవుతోంది. దీనికి తోడు ఈసారి భారీ వర్షాలు కురవడం, పంట దిగుబడులు అంతంత మాత్రమే వచ్చాయి. పంట దిగుబడి తీవ్రంగా తగ్గిందని రైతన్న ఒకవైపు ఆందోళన వ్యక్తం చేస్తుంటే అటు దళారులు, ఇటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తరుగు తేమ అంటూ పెడుతున్న కోతలు రైతాంగానికి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారిందని వాపోతున్నారు.

అనుకూలించని వాతావరణం

ఇటీవల పంటలు కోసే సమయంలో వాతావరణంలో మార్పు లు జరిగి పంటలు ఆరబెట్టిన సమయంలో వర్షా లు కురవడంతో చాలాచోట్ల వరి పంట తడిసిపోయిందని మరికొన్ని చోట్ల చేతికి వచ్చిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సరైన తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని పేర్కొంటున్నారని కర్షకులు చెబుతున్నారు. అటు దళారులకు విక్రయిద్దామంటే అమాంతం ధరను తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అటు అమ్ముకోలేక ఇటు చేతికొచ్చిన పంట నిల్వచేయలేక అవస్థలు తప్పట్లేదంటున్నారు.

యజమానుల తిప్పలు తప్పట్లేదు



అసలే వాతావరణం అనుకూలించక ధాన్యం విక్రయించని పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తమలాంటి కౌలు రైతులు ఎంతో ఇబ్బం దులు పడుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో కౌలుకు ఇచ్చిన యజమానులు మాత్రం కౌలు విషయంలో తగ్గడం లేదు.

- సున్నం సాయిలు, రైతు, కాంశెట్‌పల్లి

ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం



వర్షాల కారణంగా పొలాలకు కౌలుకు తీసుకుని ఇబ్బంది పడుతున్న కౌలు రైతుల బాధ వర్ణనాతీతం. వారి ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

- సువర్ణ, తహసీల్దార్

రైతులకు అండగా ప్రభుత్వం


కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

మద్నూర్, పెద్దకొడప్‌గల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మద్నూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రా లలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుం డా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోయా ధాన్యం క్వింటాలుకు రూ.5,328 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. కావున రైతులంతా సోయా ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మా ర్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య రమేష్, సిం గిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరాస్ సాయిలు, గ జానంద్ దేశాయి, ఆలయ కమిటీ చైర్మన్ రా మ్ పటేల్, జుక్కల్ ఆత్మ కమిటీ మాజీ చైర్మ న్ కొండ గంగాధర్, నాయకులు హనుమాండ్లు స్వామి, బండి గోపి, జావిద్ పటేల్, మ ద్నూర్ సొసైటీ కార్యదర్శి బాబురావు పటేల్ పాల్గొన్నారు.

● ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం పెద్దకొడప్‌గల్ మండలంలోని బూర్గుపల్లిలో నూతన తపాలా కార్యాలయాన్ని సంబంధిత శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. టెక్నాలజీ పెరిగిన ఈ రోజుల్లో గ్రామీణ ప్రాంత ప్రజలకు తపాలా సేవలు అందడం అభినందనీయమన్నారు. అనంతరం పింఛన్‌దారులకు పింఛన్ అందజేశారు. సీనియర్ పోస్టల్ సూప రింటెండెంట్ జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో అభినవ్ చందర్, పోస్టల్ డీఐవో ప్రకాష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, శ్యామప్ప, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో ఉమ్మడి జిల్లా వాసుల ప్రతిభ

కామారెడ్డి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని దావనగిరి జిల్లా కేంద్రంలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగిన 31వ దక్షిణ భారత జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మహిళ జట్లు సంయుక్తంగా కాంస్య పతకం సాధించి మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుడు మధుసుదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆర్మూర్ మండలం ఫతేపూర్ గ్రామానికి చెందిన అలల్ సృజన తెలంగాణ మహిళ జట్టుకు ప్రాతినిధ్యం వహించి మంచి ప్రదర్శన చూపి తెలంగాణ విజయంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు

రాజంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని ఎల్లాపూర్‌తండా, నడిమితండా, కొండాపూర్, ఆర్గొండ గ్రామాలలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసినట్లు ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్లకు మార్కవుట్ చేసి నిర్మాణ పనులు వేగంగా చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, లేదా గ్రామాల్లో అందుబాటులో ఉన్న గ్రామపంచాయతీ కార్యదర్శులకు లేదా మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వం అందించే మంచి అవకాశాన్ని ప్రతి ఒక్క లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శ్రీజ, వంశీకృష్ణ, లక్ష్మణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి: డీఎస్పీ


శిబిరాన్ని ప్రారంభిస్తున్న బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి

బాన్సువాడటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌డీ అతిథి గృహంలో ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం శిబిరంలో పాల్గొన్న పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ తుల శ్రీధర్, రూరల్ సీఐ తిరుపతయ్య, ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్


గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్సై భార్గవ్ గౌడ్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామ శివారులో ఎల్లారెడ్డి- మెదక్ ప్రధాన రహదారిపై బుధవారం బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు తీవ్రగాయమై రక్తస్రావంతో నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ వ్యక్తిని అదేమార్గంలో వెళ్తూ గమనించిన నాగిరెడ్డిపేట్ ఎస్సై భార్గవ్‌గౌడ్ వాహనాన్ని ఆపి స్థానికుల సహాయంలో వాహనంలో ఎక్కించుకుని హుటాహుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స అందడంతో అతనికి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఈ మేరకు ఎస్సై భార్గవ్ గౌడ్‌ను అటు రక్తదానం చేసి వస్తూ ప్రాణ దానం చేశారని పలువురు అభినందిస్తున్నారు.


నివాళులర్పిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు

టెక్నికల్ అసిస్టెంట్‌కు నివాళి

తాడ్వాయి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో వేధింపులతో అకాల మరణం చెందిన బీఎఫ్‌టీ భార్గవ్‌కి టెక్నికల్ అసిస్టెంట్లు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారుల వేధింపులు ఆపాలని అన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. సాంకేతిక సహాయకుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, ఉపాధి హామీ సిబ్బంది స్వామి, రామకృష్ణ, రేఖా రాణి, మండల కార్యాలయ సిబ్బంది రాజేష్, అవినాష్, రాజ్ కుమార్, మురళి, సందీప్, టికయ్య తదితరులు పాల్గొన్నారు.

పందుల బెడద తీర్చాలి


మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డు దేవునిపల్లిలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహేష్‌కు గ్రామ యువకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రధానంగా పందుల బెడద తీవ్రంగా ఉందన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గుంపులుగుంపులుగా సంచరిస్తూ కల్లాల్లోని వరిధాన్యాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. పారిశుధ్యం సరిగా లేకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి


రోడ్డుపై అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ఇందల్వాయి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే అమలుచేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారిపై బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శనతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ మోహన్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ. 8500 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియింబర్స్‌మెట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో రూ.30 కోట్లు తెలంగాణ విశ్వవిద్యాల యానికి రావాల్సి ఉందని అన్నారు. పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసేంతవరకు ఏబీవీపీ పోరాటం ఆగదన్నారు. పేద మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా కనీసం ఇప్పటివరకు విద్యార్థుల గురించి ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను రాష్ట్రంలో ఎక్కడా తిరగనివ్వం అని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేసేముందు ఆలోచించాలన్నారు. యూనివర్సిటీ అధ్యక్షులు పృథ్వీ, యూనివర్సిటీ కార్యదర్శి సమీర్, యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు అశోక్, అక్షయ్, అజయ్ యూనివర్సిటీ సంయుక్త కార్యదర్శులు అనిల్, నవీన్ సోషల్ మీడియా ఇంచార్జ్ కార్తీక్, విద్యార్థి నాయకులు శివ, విజయ్, పవన్ కళ్యాణ్, రామకృష్ణ, అభిలాష్, నెహ్రూ, రోహన్, హర్షవర్ధన్, నందన్ నితిన్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ కార్మికుల సమ్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయిస్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల, సర్వే స్టేషన్ ఎలక్ట్రిషన్, కంప్యూటర్ ఆపరేటర్ సిబ్బంది సమస్యలు పరిష్కరించి వారి యొక్క పనిభద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కమిషనర్‌కు విన్నవించారు. అలాగే జనాభా ప్రతిపాదన కార్మికుల సంఖ్యను పెంచాలని కార్మికులకు ఒక కార్మికుడికి రెండు మూడు వార్డులు అప్పజెప్పడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

అధిక సుంకాలు సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక స్థితిగతులను దెబ్బతీయడమే ధ్యేయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడని ఎగుమతి దిగుమతులపై అధిక సుంకాలు సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో రాజేశ్వర్ అధ్యక్షత నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దని అమెరికా అధ్యక్షుడు భారత్ పై ఒత్తిడి తెస్తున్నాడని అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని డిసెంబర్ 26 వరకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు భూమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, తదితరులు పాల్గొన్నారు.

2న ఇందూరు అపూర్వ అవార్డులు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాలలో కృషి చేసిన వారికి అందించే ఇందూరు అపూర్వ అవార్డ్ అమృతలత జీవన సాఫల్య పురస్కారాల ప్రధానోత్సవం నవంబర్ 2న జరుగనున్నట్లు అవార్డు వ్యవస్థాపకురాలు అమృతలత, కన్వీనర్ కిరణ్ బాల తెలిపారు. 2024 సంవత్సరానికి గాను రచయితలు వసుంధర, శాంతి నారాయణ, జర్నలిస్ట్ వల్లీశ్వర్, 2025 సంవత్సరానికి భాస్కర్, వెంకటకృష్ణ, అశోక్‌కుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు. శంకర్, పంచరెడ్డి లక్ష్మణ్, స్వయం ప్రకాష్, విజయ్‌కిషన్‌రెడ్డి, కుసుమలతారెడ్డిలు ఎంపికైనట్లు తెలిపారు. 2025 సంవత్సరానికి అపురూప అవార్డ్‌కు వసంత వివేక్, నర్సింహారెడ్డి, సుజాత, సుమీలశర్మ, ఓం ప్రకాష్‌లు ఎంపికైనట్లు తెలిపారు. అవార్డు ప్రధానోత్సవం అపురూప వెంకటేశ్వర ఆలయంలో జరుగుతుందని అన్నారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రుల చెంతకు


తల్లిదండ్రులకు పాపను అప్పగిస్తున్న పోలీసులు

పిట్లం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పిట్లం మండల కేంద్రంలోని బుడగ జంగం కాలనీకి చెందిన వరలక్ష్మీ పాపతో కలిసి కిరాణం కొట్టుకువెళ్లగా బస్టాండ్ ప్రాంతంలో తప్పిపోయింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఆ తర్వాత ఆ పాపను గుర్తించిన స్థానికులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు పూర్తివివరాలు సేకరించి తల్లిదండ్రులకు ఫోన్ చేసి స్టేషన్‌కు రప్పించి అప్పగించారు. చిన్నపిల్లలతో బయటకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పిల్లల ఎదుగుదలను అంచనా వేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్య

నసురుల్లాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పర్యవేక్షణతో కూడిన అనుబంధక పోషకాహార కార్యక్రమంలో పాటించాల్సిన పద్ధతుల గురించి హెల్త్ సూపర్‌వైజర్, ఎమ్ఎల్‌హెచ్‌పీలకు బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్య మండలంలోని దుర్కి నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుట్టిన పిల్లల ఆరోగ్య సంరక్షణ, వారి ఎదుగుదల కొరకు అంగన్‌వాడీ సెంటర్లలో పాటించాల్సిన పద్ధతుల గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విద్య, సూపర్‌వైజర్ కళావతి, మోహన్, విజయ్, దయానంద్, సుధాకర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం

కామారెడ్డి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన చెట్టుకురి మల్లయ్యకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. నిర్మాణం సైతం పూర్తికాగా బుధవారం గృహప్రవేశం కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇళ్లు మంజూరైన వారు నిర్మాణ పనుల్లో ఆలస్యం చేసుకోవద్దని సూచించారు. అనంతరం గృహప్రవేశం చేసుకున్న దంపతులకు నూతన వస్త్రాలను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుదర్శన్‌రావు, మండల ఉపాధ్యక్షుడు కుమార్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శంకర్‌గౌడ్, గంగయ్య, జగదీశ్వర్, రవితేజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఇంటి ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నాయకులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాచారెడ్డి మాజీ ఎంపీపీ నర్సింగ్‌రావు

రామారెడ్డి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్ రావు పేర్కొన్నారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం మాచారెడ్డి సొసైటీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యం అక్రమంగా దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని సూచించారు. సన్నవడ్లకు క్వింటాలకు రూ.500 బోనస్ కూడా అందిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో చంద్ర రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు మద్దికుంట దయానంద్, గంగారెడ్డి, సల్మాన్, కిసరి లక్ష్మణ్, దేవదాసు, చంద్రం, బాల నర్సు, రవీందర్ నాయక్, జెసిబి దేవదాస్, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు పండ్ల రసాలను అందజేస్తున్న సీపీ సాయిచైతన్య

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

(5వ పేజీ తరువాయి)

అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడైనా జరిగితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీసులు శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా సేవా కార్యక్రమంలో కూడా ముందు వరుసలో ఉంటారని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ నర్సో నవీన్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విజయ్ అగర్వాల్, జన్నపల్లి రంజిత్, నాగరాజు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం..

ముప్కాల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సీపీ సాయి చైతన్య అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని బాల్కొండ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సేవలను నిరంతరం స్మరించుకోవడంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసుకోవడం వారిని గుర్తు చేసుకోవడంతో సమానం అన్నారు. బాల్కొండ రక్తదాన శిబిరంలో మొత్తం 123 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు పండ్లు, పండ్ల రసాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బాల్కొండ ఎస్సై శైలేందర్, ముప్కాల్ ఎస్సై రజనీకాంత్, మెండోర ఎస్సై సుహాసిని, ఇండియాన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ శిబిరానికి సీపీ సాయిచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం చేసే రక్తదానం ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. ప్రమాదాలు జరిగినపుడు రక్తం ఎక్కువగా అవసరమవుతుందన్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తి మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని సీపీ పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో 177 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో అదనపు డీసీపీ(ఏఆర్) రాంచందర్‌రావు, ఏసీపీ రాజావెంకటర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, పోలీసు యూనిట్ ఆఫీసర్ డాక్టర్ సరళ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, శ్రీనివాస్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ఇమ్రాన్ అలీ, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్‌పాషాలు పాల్గొన్నారు.



పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో రక్తదానం చేస్తున్న దృశ్యం

టార్పాలిన్లు అందవు.. కష్టాలు తీరవు

(5వ పేజీ తరువాయి)



వర్షానికి తడవకుండా కప్పిన ధాన్యం

రెట్టింపు ఖర్చు అవుతుంది. పైగా కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కోయించిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లలో నేరుగా కేంద్రాలకు తెస్తున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడంతో తేమ 17శాతంలోపు రావడానికి కనీసం వారం రోజులు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వస్తుంది. అకాల వర్షాలతో రైతులు అడుగడుగునా నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పెద్దగా పట్టించుకోకపోవడంతో రైతులే ధాన్యం కోసేందుకు ప్రైవేటుగా తెల్ల పట్టాలను అద్దెకు తీసుకుంటున్నారు. ఒక్కో పట్టాకు రోజుకు 50 నుంచి 80రూపాయల వరకు వెచ్చిస్తున్నారు. ధాన్యం కాంటా అయ్యేంత వరకు 15 నుంచి 20రోజులు పడుతుంది. అప్పటి వరకు పట్టాల ఖర్చే రైతులకు తడిసి మోపెడు అవుతుంది. కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులే కొనుక్కుంటున్నారు.

రాయితీపై అందించాలి - నర్సప్ప, రైతు

గతంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించేవి. ఇప్పుడు ఇవ్వడం లేదు. యూరియా బస్తాలతో కుట్టిన వాటితో ధాన్యం కాపాడుకుంటున్నాం.

స్పష్టత లేదు: రాజు, ఏవో, కోటగిరి

సబ్సిడీ టార్పాలిన్ల విషయంలో ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. ప్రస్తుతం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సహకార సంఘాలకు అందిస్తున్నాం. రైతులు పట్టాలను వినియోగించుకుని తిరిగి అప్పగిస్తే ఇతర రైతులకు కొంత మేలు జరుగుతుంది.

తాగునీటికి తంటాలు

బైరాపూర్‌లో ప్రజల అవస్థలు

మోపాల్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాపూర్ గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి కొద్ది దూరంలోనే కొంత మంది నివాసపు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. ఇక్కడున్న వారికి తాగునీటి పైప్‌లైన్‌లు లేకపోవడంతో సమీప ప్రాంతంలోని పొలాల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. స్థానికంగా సర్పంచులు, ఎంపీటీసీలు లేకపోవడంతో స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా పట్టించుకున్న పాపాన పోకపోవడం దురదృష్టకరం అని వారు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పట్టించుకున్నవారే కరువయ్యారని వారు వివరించారు. ఇక్కడ నివాసపు గుడిసెలు వేసుకొని రెండు మూడు సంవత్సరాలు అవుతుందని వారు వివరించారు. గ్రామానికి సమీప దూరంలోనే ఇండ్లను నిర్మించుకుని నివసిస్తున్నామన్నారు. తాము ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై స్థానికంగా ఉన్న అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వ్యవసాయ బావుల నుంచి ఉదయం, సాయంత్రం పూట నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాము ఎదుర్కొంటున్న నీటి పరిష్కారం కోసం కృషి చేయాలని వారు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో స్థానికంగా ఉన్న అధికారులదే ఇష్టారాజ్యంగా నడుస్తుందన్నారు.



బైరాపూర్‌లో పొలం నుంచి నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

విద్యాప్రాంగణాల్లో బాలికలకేది రక్షణ..?

(5వ పేజీ తరువాయి)

నగరంలోని మోడ్రన్ పబ్లిక్ స్కూల్‌లో ఓ ఉపా ధ్యాయుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించగా విధు ల నుంచి తొలగించారు. గతంలో నందిపేట మండలంలో ఓ ఉపాధ్యాయుడు బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో గ్రామస్థులు చితకబాదారు. ఏర్గట్ల బడిలలో బాలికల విషయంలో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని అధికారులు సస్పెండ్ చేశారు. బోధన్ మండలంలో ఓ టీచర్ పదో తరగతి విద్యార్థిని వేధింపులకు గురిచేసిన ఘటన జరిగింది. వెలుగులోకి వచ్చే ఘటనలు కొన్నే ఉంటున్న అనేక ఘటనలు లోలోపన తొక్కిపెడుతున్నారు.

సర్కారు బడుల్లో రక్షణ ఏదీ..?

నూతనంగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.లక్షలు ఖర్చు చేసింది. అయినా సీసీ కెమెరాలు లేకపోవడంతో పాఠశాల పనివేళలు ముగిసిన తర్వాత ఆకతాయిలకు పాఠశాలలు అడ్డాలుగా మారుతున్నాయి. జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో ఎవరుపడితే వారు పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నారు. కంప్యూటర్‌లు, ఫర్నిచర్ దొంగతనం అయిన ఘటనలు ఉన్నాయి. సీసీ కెమెరాలు ఉండడం వల్ల పాఠశాలల్లో జరిగిన ప్రతి విషయం రికార్డు అయ్యే అవకాశం ఉంటుంది.

శిక్షణ పొందిన రైతులకు ధ్రువపత్రాలు

సుభాష్‌నగర్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణ సేవలలో ఇన్‌పుట్ డీలర్స్‌గా శిక్షణ పూర్తిచేసుకున్న 77 మంది రైతులకు బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఆత్మ ద్వారా రైతులకు మెరుగైన సలహాలు ఇవ్వడంతో పాటు పంట ఉత్పత్తి, నేల స్వభావం, మొక్కల రక్షణ, పశు సంవర్ధకం, సాంకేతికపరమైన అంశాలలో 48 వారాల పాటు ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆత్మ జిల్లా అధికారి తిరుమల ప్రసాద్, ఏడీఏ అనిత పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు పొందిన రైతులు



సంజయ్‌ని సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా సంజయ్

ఇందూర్, అక్టోబర్ 29, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లా మున్నూరు కాపు సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా నగర మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ నియమితులయ్యారు. బుధవారం ప్రగతినగర్ మున్నూరు కాపు సంఘంలో నగరంలోని 10 మున్నూరు కాపు సంఘాల తర్ఫల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు జిల్లా మున్నూరు కాపు సంఘం కార్యవర్గం సమావేశమై ఏకగ్రీవంగా తాత్కాలిక అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. ఏడాది క్రితం ఆయన మృతి చెందడంతో జిల్లా అధ్యక్ష పదవి ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో జిల్లా మున్నూరు కాపు సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా ఆయన తనయుడు సంజయ్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు న్యావనంది రాఘవేందర్, ధర్మపురి సురేందర్, ఆకుల చిన్న రాజేశ్వర్, బంటు బలరాం, కులచారి వెంకటేష్, శరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ సేవలు మెరుగుపర్చాలి

కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబర్ 29, (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పశు సంవర్ధక శాఖ సేవలను మరింతగా మెరుగుపర్చాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పశుసంవర్ధకశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పశు సంపద కలిగిన రైతులకు అవసరమైన సేవలు అందించేలా పశు వైద్య అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. వెటర్నిటి డాక్టర్‌లు లేనిచోట ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలన్నారు. మూగ జీవాలకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పశు సంపదను పెంపొందించి ఆర్థిక ప్రయోజనాలు పొందేలా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఆయా సీజన్‌లలో సోకే వ్యాధులకు నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో పశువైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు సంచార పశువైద్య వాహనం 1962 ద్వారా రైతుల వద్దకు వెళ్లాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

ఇందూరు, అక్టోబర్ 29, (ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం ఆయన అన్ని మండలాల ఎంఈఓలతో విద్యాశాఖ పని తీరుపై మండలం వారీగా సుదీర్ఘ సమీక్ష జరిపారు. టాయిలెట్స్, నీటి వసతి, విద్యుత్ సదుపాయం వంటి వసతులన్నీ ప్రతి బడిలో అందుబాటులో ఉండాలన్నారు. బాలబాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్స్ లేనిచోట వెంటనే వాటి నిర్మాణాలు జరిపించేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన చోట సత్వరమే పనులు చేపట్టేలా చూడాలని, అవసరమైన వాటికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతి రోజు శత శాతం విద్యార్థులు హాజరును ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా చేయాలని, అందరూ ఆధార్‌నుఎన్ రోల్ చేయించి యూడైస్ పోర్టల్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే, అన్ని యాజమాన్యాలు ఆధార్, అపార్ జెనరేట్ చేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. అపార్ జెనరేట్ చేయని పాఠశాలలకు నోటీసులు జారీ చేసి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఏకరూప దుస్తుల స్టిచింగ్ సకాలంలో పూర్తి అయ్యేలా చొరవ చూపాలని, ఎక్కడైనా సివిల్ వర్క్స్ పనులు పెండింగ్‌లో ఉంటే వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని సూచించారు. బడులలో మధ్యాహ్న భోజనం అమలు తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు భవిత కేంద్రాల నిర్వహణ, వయోజన విద్య అమలు తీరు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి ఎంఈఓలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఐఈఓ రవికుమార్, డీఈఓ అశోక్, అన్ని మండలాల ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి 59 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

16 వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల

మెండోర , అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 59వేల 654 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోకి మంగళవారం ఉదయం స్వల్పంగా వరద రావడంతో 8 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. రాత్రి వరద పెరగడంతో మరో 8 వరద గేట్లను ఎత్తి 16 వరద గేట్ల ద్వారా 50 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టు గేట్లను సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు కేంద్ర జల వనరుల అధికారుల ఇరు రాష్ట్రాల ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో బాబ్లీ గేట్లను తెరిచి ఉంచారు. వరద ఉధృతి తగ్గితే బాబ్లీ గేట్లను మూసివేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుండి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8000 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. జూన్ 1వ తేదీ నుండి ప్రాజెక్టులోకి 891 టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రధాన కాలువ ద్వారా 824 టీఎంసీల నీటిని విడుల చేయడం జరిగిందని ప్రాజెక్టు ఈఈ తెలిపారు.

వానొచ్చే.. వరదొచ్చే

» నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నీరు » రెండు గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ గా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటిపారు దల శాఖ అధికారులు బుధవారం డీఆర్ నెంబర్ 5లోని రెండు గేట్లు ఎత్తి 9500 క్యూసెక్కుల వరద నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యాన్ని నిలువ చేస్తూ మిగతా నీటిని మంజీరాలోకి విడుదల చేయడం జరుగుతుందని, వర్షాలు కొనసాగితే ప్రాజెక్టుకు మరింత భారిగా వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు.

బాలరక్షక్ భవన్ నుంచి బాలుడి అదృశ్యం

తిరుమలగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల రక్షక్ భవన్ నుంచి బాలుడు అదృశ్యమయ్యాడు. బొల్లారం ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన సాయికుమార్ (12) రెండు రోజుల క్రితం తప్పిపోయాడు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అతడిని బుధవారం బొల్లారం జీవీరెడ్డి కాలనీలోని బాలరక్షక్ భవనానికి తీసుకెళ్లారు. కౌన్సెలింగ్ ఇస్తున్న సమయంలో బాలుడు పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. బాలరక్షక్ భవన్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడు సాయికుమార్

దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర

సుభాష్‌నగర్, అక్టోబర్ 29, (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర పన్నుతున్నారని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్ ఆర్ ఎస్ రత్నాకర్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను సాంపిల్‌గా పంజాబ్, హర్యాణలో మొదటిసారి కాంగ్రెస్ బీజం వేస్తే ప్రస్తుత బీజేపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా దీనిని అమలు చేస్తూ దళితులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్ర అన్నారు. కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు వీటిని అమలు పరుస్తుంటే రాహుల్‌గాంధీకి తెలియడంలేదా అని ఆయన ప్రశ్నించారు. మాల సామాజిక వర్గం ఈ రోజు ఎదుర్కొంటున్న పరిస్థితులకు ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో గైని గంగారాం, సక్కి ప్రభంజన్, సంజీవ్, లక్ష్మణ్, బాల శౌరి, నాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

ఇదేం గోస..

వర్షాలతో తడుస్తున్న ధాన్యం

అవస్థలు పడుతున్న రైతులు

మోపాల్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి):అకాల వర్షాలతో రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లమీద, కళ్లాల వద్ద ఉంచిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవడంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో తడిసిపోయిన ధాన్యం అంతా మొలకలు ఎత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశానికి రాజు రైతన్న అని చెప్పడం తప్ప రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకునేవారు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు ఇప్పటికైనా ఆలోచించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పలు గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళ

బడి అభివృద్ధికి ఆలయ కమిటీ సహకారం

భీమ్‌గల్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం దుబాయ్ లొద్ది రామన్న ఆలయ కమిటీ సభ్యులు ముందుకు వచ్చారు. కమిటీ సూచన మేరకు ముందుకు సభ్యులు కొందరు పాఠశాలను సందర్శించి అవసరాలను గుర్తించారు. విద్యార్థులకు అత్యవసరమైన తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు, వాటర్ ట్యాంక్‌తో పాటు పైప్‌లైన్ నిర్మాణం చేయించారు. పాఠశాలలో కంప్యూటర్ల కోసం ఉన్న వాటిలో చెడిపోయిన బ్యాటరీల స్థానంలో కొత్త వాటిని మార్పించారు. తరగతి గదులకు ఉన్న కిటికీ రెక్కలు మార్పించారు. పాఠశాల అభివృద్ధికి ఇప్పటికే సుమారు లక్ష 80వేల రూపాయలు కమిటీ ఆధ్వర్యంలో ఖర్చు చేశారు. భవిష్యత్తులో పిల్లల కోసం డెస్క్ బెంచీలను కొనుగోలు చేసి అందుబాటులోకి తెస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వాటర్ ప్లాంట్ ప్రారంభం చేశారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రైమరీ హెడ్ మాస్టర్లు కరుణాకర్, దిలీప్, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

సీలింగ్ భూమికి పట్టాలివ్వాలి

సిరికొండ,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూమిని సాగు చేసుకుంటున్న పేదలందరికి పట్టాలివ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరికొండ మండలం హుస్సేన్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 826లో గల సీలింగ్ భూమిని గత కొన్నేళ్లుగా గ్రామానికి చెందిన నిరుపేదలు ఆక్రమించుకుని సాగుచేసుకుంటున్నారని పేర్కొన్నారు. పచ్చగున్న భూములన్నీ తమ భూములని అటవీ శాఖ అధికారులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. భూముల వివాదాలను పరిష్కారించాలన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి

ఇందల్వాయి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో తడిసి ముద్దయిన వరి ధాన్యాన్ని ఆరుగాలం కష్టపడి రైతులు పంటలు పండిస్తే అకాల వర్షాల వల్ల చేతికొచ్చినపంట చేజారిపోతుందని, రైతుల కండ్ల ముందే వరి ధాన్యం తడిసి ముద్దయితే రైతు గుండె బరువెక్కుతుందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేననీ ఆయన అన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మురళి, సహాయ కార్యదర్శి మోహన్, గంగాధర్, గణేష్,పాల్గొన్నారు.

మోపాల్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిసి ముద్దయిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. బుధవారం మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో తడిసిపోయిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు.కార్యక్రమంలో నాయకులు ఎర్రన్న, నరసయ్య, మల్లేష్, చిన్నయ్య పాల్గొన్నారు.



మోపాల్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, అక్టోబర్ 29, (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హైదరాబాద్‌లోని రహమత్‌నగర్ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి దీపక్ తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమవుతూ పదేళ్లుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెనకబడిపోయిందని బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వం నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైందని ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బీజేపి పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ప్రజలను బీజేపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, లక్ష్మి, మల్లేష్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలతో మాట్లాడుతున్న ధన్‌పాల్ →

సినిమా గైడ్

దేవి : బైసన్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కె-ర్యాంప్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : డ్యూడ్ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : కె-ర్యాంప్ (11.00, 4.40, 7.30, 10.20)
:బైసన్ (తెలుగు) (1.35)
స్క్రీన్-2 : డ్యూడ్ (1.30,7.30)
: తెలుసు కదా (4.30)
:బైసన్ (తెలుగు) (10.20)
స్క్రీన్-3 :బైసన్ (తెలుగు) (11.00,4.30)
:తమ్మ(1.50,7.30)
:ఏక్ దివానికి దివానియత్:(హింది) (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : డ్యూడ్ (11.00, 2.05, 5.00, 7.55, 10.50)
స్క్రీన్-2 : కాంతారా చాప్టర్-1 (10.20)
: కె-ర్యాంప్ (1.45, 7.35, 10.30)
: మిత్రమండలి (4.40)
స్క్రీన్-3 : తెలుసు కదా (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్క్రీన్-4 : కె-ర్యాంప్ (10.20)
: మిత్రమండలి (1.15, 7.35)
: కాంతారా చాప్టర్-1 (4.10, 10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,20,800	రూ.1,11,500	రూ.1540

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.260	రూ. 280

